


# మన దునియా

Our News Our World

RNI Number TELTEL/2023/85680

మన అక్షరం - మన ప్రపంచం

సంపుటి : 3 | సంచిక : 364 | సెప్టెంబర్ 4 శుక్రవారం 2026 | పేజీలు : 8 | వెల రూ. 4.00/-



రిపోర్టర్లు కావలెను

తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.

మన దునియా

9490056011,9603969335


## ములుగు జనరల్ ఆస్పత్రిలో

# సౌకర్యాలు నిల్.. సమస్యలు ఫుల్!







### "నేను రాను బిడ్డో.. సర్కారు దావకానకు" అన్న చందంగా ఆస్పత్రి నిర్వహణ

- పేషెంట్ వార్డుల్లో తాళం వేసిన మరుగుదొడ్లు.. నీళ్ల కోసం రోగుల అవస్థలు
- ఫ్యాన్లు, తాగునీరు, వాష్‌రూమ్‌లు లేక రోగుల ఇబ్బందులు
- మహిళా రోగుల పరిస్థితి మరింత దయనీయం
- సూపరింటెండెంట్‌కు పలుమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదంటున్న రోగులు
- సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనకు దిగుతామని ప్రజా సంఘాల హెచ్చరిక



**మన దునియా,ములుగు జిల్లా:సెప్టెంబర్ 03**

ములుగు జిల్లా కేంద్రంలోని ములుగు జనరల్ ఆస్పత్రి నిర్వహణ తీరు రోగులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. జిల్లాలోని మారుమూల, ఏజెన్సీ ప్రాంతాల ప్రజలకు పెద్ద దిక్కుగా ఉన్న ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో కనీస వసతులు కరువవడంతో రోగులు అవస్థలు పడుతున్న పరిస్థితి నెలకొంది. సౌకర్యాలు నిల్.. సమస్యలు ఫుల్!లిఅన్నట్లుగా ఆస్పత్రి పరిస్థితి తయారైందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేషెంట్ వార్డుల్లోని మరుగుదొడ్లకు తాళాలు వేసి ఉండటం, కొన్ని చోట్ల నీటి సౌకర్యం లేకపోవడం, ఫ్యాన్లు తదితర కనీస వసతులు సక్రమంగా లేకపోవడంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు చెబుతున్నారు.

**కాలకృత్యాల కోసం నరకయాతన**

ఉదయం లేచిన తర్వాత కనీసం కాలకృత్యాలు తీర్చుకోవాలన్నా నీటి సౌకర్యం లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారని వాపోతున్నారు. ముఖ్యంగా మహిళా రోగులు తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియని దయనీయ పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు దోమల బెడద.. మరోవైపు కనీస సౌకర్యాల కొరత.. ఇలా సమస్యల వలయంలో రోగులు చికిత్స పొందాల్సిన పరిస్థితి ఏర్పడిందని పలువురు ఆరోపిస్తున్నారు.


(మిగతా 2వ పేజీలో..)


## రేవంత్ రెడ్డి ఢిల్లీ టూర్ రహస్యాలు బహిర్గతం.. 'తెలుగు స్క్రైబ్'పై సైబర్ క్రైమ్ కేసు

- సీఎం రేవంత్ రెడ్డి భద్రతా సమాచారం లీకేజీపై కేసు
- 'తెలుగు స్క్రైబ్' ఎక్స్ ఖాతా నిర్వాహకులపై సీఎస్‌వో ఫిర్యాదు
- ఇది పత్రికా స్వేచ్ఛపై దాడి అంటున్న తెలుగు స్క్రైబ్
- ఖైరతాబాద్ నుంచి సైబర్ క్రైమ్ పోలీసులకు కేసు బదిలీ

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనకు సంబంధించిన అత్యంత రహస్య భద్రతా సమాచారాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేశారన్న ఆరోపణలపై


(మిగతా 2వ పేజీలో..)




## కొండా సురేఖ బర్తరఫ్.. రేవంత్ రెడ్డిని శపించిన ఆమె కుమార్తె సుస్మిత

- తెలంగాణ కేబినెట్ నుంచి మంత్రి కొండా సురేఖ తొలగింపు
- సీఎం రేవంత్ రెడ్డిని శపించిన సురేఖ కుమార్తె కొండా సుస్మిత
- పరకాల నుంచి పోటీ చేయాలంటూ ముఖ్యమంత్రికి సవాల్
- తన తల్లికి అన్యాయం జరిగిందని సుస్మిత ఆవేదన



తెలంగాణ మంత్రివర్గం నుంచి కొండా సురేఖను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బర్తరఫ్ చేయడం రాజకీయంగా పెను సంచలనం సృష్టించింది.


(మిగతా 2వ పేజీలో..)


## మోదీని అడిగే దమ్ముందా?.. తెలంగాణ బీజేపీ నేతలకు పొన్నం సవాల్

- మోదీని కలిసి తెలంగాణ హక్కులు అడగాలని సూచన
- కేంద్ర నిధులు, ప్రాజెక్టులపై ప్రశ్నించాలని డిమాండ్
- తెలంగాణకు నిధుల విషయంలో అన్యాయం జరుగుతోందని ఆరోపణ
- మెట్రో, నవోదయ, కేంద్రీయ పాఠశాలల అంశాలు ప్రస్తావన
- ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వాలని డిమాండ్

తెలంగాణలో బీజేపీ నేతలు తమ పార్టీలోని అంతర్గత విభేదాలను కప్పిపుచ్చుకునేందుకే


(మిగతా 2వ పేజీలో..)




## కొండా సురేఖ బర్తరఫ్..

### తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త రికార్డు!

**మన దునియా,హైదరాబాద్:సెప్టెంబర్ 03**

తెలంగాణ రాజకీయాల్లో గత కొద్దిరోజులుగా తీవ్ర దుమారం రేపుతున్న కొండా సురేఖ ఎపిసోడ్‌కు ఎట్టకేలకు ఎండ్ కార్డ్ పడింది. వివాదాస్పద పరిణామాల నేపథ్యంలో కొండా సురేఖను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేస్తూ కాంగ్రెస్ అధిష్టానం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన నిర్ణయం తీసుకున్నారు. సురేఖను మంత్రి వర్గం నుంచి తక్షణమే తొలగించాలని కోరుతూ సీఎం రేవంత్ రెడ్డి పంపిన లేఖ లోక్ భవన్‌కు చేరింది. ఈ ప్రతిపాదనపై గవర్నర్ అధికారిక నిర్ణయం తీసుకోవడమే తరువాయిగా మిగిలింది.


(మిగతా 2వ పేజీలో..)




మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

# కొండా సురేఖ బర్తరఫ్..

(మొదటి పేజీ తరువాయి)

**తెలంగాణ చరిత్రలో సరికొత్త రికార్డు:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న ఈ కఠిన నిర్ణయంతో తెలంగాణ రాజకీయాల్లో ఒక అరుదైన రికార్డు నమోదు కాబోతోంది. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మంత్రివర్గం నుంచి ఉద్వాసనకు గురైన మూడో



మంత్రిగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో తొలి మంత్రిగా కొండా సురేఖ నిలవనున్నారు. అంతేకాకుండా, రాష్ట్రంలో బర్తరఫ్ అయిన తొలి మహిళా మంత్రిగా కూడా కొండా సురేఖ చరిత్రకెక్కనున్నారు.

**గతంలో బర్తరఫ్ అయిన మంత్రులు వీరే:**

తెలంగాణ రాష్ట్రం అవతరించిన తర్వాత కేబినెట్ నుంచి మంత్రులను తొలగించడం ఇది మూడోసారి. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత బీఆర్ఎస్ ఫస్ట్ టర్మ్ ప్రభుత్వంలో డాక్టర్ తాటికొండ రాజయ్యను 2015 లో నాటి సీఎం కేసీఆర్ బర్తరఫ్ చేశారు. నాటి బీఆర్ఎస్ ప్రభుత్వంలో తొలి ఉప ముఖ్యమంత్రి, వైద్యారోగ్య శాఖ మంత్రిగా ఉన్న రాజయ్యపై అవినీతి ఆరోపణలు రావడంతో ఈ చర్యలు తీసుకున్నారు. అనంతరం బీఆర్ఎస్ రెండో దఫా ప్రభుత్వంలో మే 2021లో ఈటల రాజేందర్‌పై కూడా కేసీఆర్ బర్తరఫ్ చేశారు. వైద్యారోగ్య శాఖ మంత్రిగా ఉండగా ఈటలపై అసైన్డ్ భూముల ఆక్రమణ ఆరోపణలు రావడంతో ఆయనను కూడా కేబినెట్ నుంచి తొలగించారు. అయితే ఇప్పటి వరకు బర్తరఫ్ అయిన ముగ్గురిలో రాజయ్య, ఈటల రాజేందర్ ఇద్దరు వైద్యారోగ్యశాఖ మంత్రులుగా పని చేస్తుండగా చర్యలకు గురికాగా కొండా సురేఖ మాత్రం దేవాదాయ శాఖకు ప్రాతినిధ్యం వహిస్తూ వేటుకు గురయ్యారు.

# మోదీని అడిగే దమ్ముందా?.. తెలంగాణ బీజేపీ నేతలకు పొన్నం సవాల్

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాలపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే హైదరాబాద్‌లో కూర్చొని రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించడం కాకుండా ఢిల్లీకి వెళ్లి ప్రధాని నరేంద్ర మోదీని నిలదీయాలని సవాల్ చేశారు.తెలంగాణకు కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు, అనుమతులపై బీజేపీ నేతలు ఎందుకు మాట్లాడటం లేదని పొన్నం ప్రశ్నించారు. రాష్ట్రానికి రావాల్సిన నిధుల కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాల్సిన బాధ్యత తెలంగాణ బీజేపీ నేతలపై ఉందన్నారు. తెలంగాణ ప్రజల కోసం పోరాడే దమ్ము చూపించాలని సూచించారు.బీజేపీ పాలిత రాష్ట్రాలకు కేంద్రం నుంచి నిధులు, ప్రాజెక్టులు మంజూరవుతున్న తీరును తెలంగాణ విషయంలో ఎందుకు అమలు చేయడం లేదో ఆ పార్టీ నేతలు సమాధానం చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తేనే రాజకీయ ఉనికి కాపాడుకోవచ్చని భావించడం సరికాదన్నారు. ప్రతిపక్షంగా నిర్మాణాత్మకంగా వ్యవహరించి రాష్ట్ర హక్కుల కోసం కేంద్రాన్ని ప్రశ్నించాలని సూచించారు.గతంలో పదేళ్ల పాటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న టీఆర్ఎస్ ప్రభుత్వం అనేక బకాయిలు పెట్టినప్పుడు బీజేపీ నేతలు ఎందుకు ప్రశ్నించలేదని పొన్నం నిలదీశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పటికప్పుడు చెల్లింపులు చేస్తూ పాత బకాయిలను కూడా పరిష్కరించే దిశగా ముందుకు వెళ్తోందన్నారు.తెలంగాణకు సంబంధించిన అనేక హామీలు, నిధులు, ప్రాజెక్టులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని మంత్రి ఆరోపించారు. రాష్ట్రానికి న్యాయంగా రావాల్సిన పన్నుల వాటా కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రాన్ని డిమాండ్ చేస్తోందన్నారు. తెలంగాణకు పెండింగ్‌లో ఉన్న మెట్రో రైల్, నవోదయ విద్యాలయాలు, కేంద్ర పాఠశాలలు, రీజినల్ రింగ్ రోడ్ తదితర ప్రాజెక్టులకు వెంటనే అనుమతులు, నిధులు మంజూరు చేయాలని కోరారు.రాష్ట్ర ప్రయోజనాల కోసం తెలంగాణ బీజేపీ నేతలు ఢిల్లీకి వెళ్లి ప్రధాని మోదీని కలిసి నిధులు, ప్రాజెక్టులపై స్పష్టమైన హామీ తీసుకురావాలని పొన్నం ప్రభాకర్ సూచించారు.



# రేవంత్ రెడ్డి ఢిల్లీ టూర్ రహస్యాలు బహిర్గతం..

## 'తెలుగు స్క్రైబ్'పై సైబర్ క్రైమ్ కేసు

(మొదటి పేజీ తరువాయి)

'తెలుగు స్క్రైబ్' అనే ఎక్స్ ఖాతా నిర్వాహకులపై కేసు నమోదైంది. సీఎం చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ (సీఎస్‌వో) కేబీ ఫ్రాంక్లిన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.రేవంత్ రెడ్డి జులై 13న ఢిల్లీ పర్యటనకు వెళ్లారు. ఈ పర్యటనకు సంబంధించి ఆయన నిమిషం-నిమిషం కార్యక్రమం, జడ్-ప్లస్ భద్రతా ఏర్పాట్లు, సీఎస్‌వో అధికారిక మొబైల్ నంబర్, అత్యవసర పరిస్థితుల కోసం సీఎం బ్లడ్ గ్రూప్ వంటి సున్నితమైన వివరాలతో కూడిన వైర్‌లెస్ సందేశాన్ని సీఎం ప్రైవేట్ సెక్రటరీ కార్యాలయం నుంచి సంబంధిత అధికారులకు పంపించారు. అయితే, అదే రోజు ఈ రహస్య సమాచారాన్ని 'తెలుగు స్క్రైబ్' తమ ఎక్స్ ఖాతాలో ప్రచురించింది. దీంతో సీఎం భద్రతకు సంబంధించిన వ్యూహాత్మక వివరాలు బహిర్గతమయ్యాయి. ఈ ఘటనపై తీవ్రంగా స్పందించిన సీఎం చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ కేబీ ఫ్రాంక్లిన్, జులై 14న పోలీసులకు ఫిర్యాదు చేశారు. అత్యంత గోప్యంగా ఉండాల్సిన సమాచారం బయటకు రావడం భద్రతకు ముప్పు కలిగించే చర్య అని ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారు. అధికారుల్లో ఎవరో ఒకరు ఈ సమాచారాన్ని అక్రమంగా లీక్ చేసి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. తొలుత ఖైరతాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా, ఉన్నతాధికారుల ఆదేశాలతో దర్యాప్తు కోసం దీనిని సైబర్ క్రైమ్ పోలీసులకు బదిలీ చేశారు. భారతీయ న్యాయ సంహిత, ఐటీ చట్టంలోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. ఈ కేసు నమోదుపై 'తెలుగు స్క్రైబ్' ఎక్స్ వేదికగా స్పందించింది. "ఢిల్లీ పర్యటనలపై వార్త రాసినందుకు రేవంత్ రెడ్డి మరో మెడల్ ఇచ్చారు. దేశంలో ఒక సీఎం తన పర్యటనలపై వార్త రాసినందుకు కేసు పెట్టడం ఇదే మొదటిసారి" అని తమ పోస్ట్‌లో పేర్కొంది. గతంలోనూ ఈ సోషల్ మీడియా హ్యాండిల్ ప్రభుత్వం, సీఎంపై విమర్శనాత్మక పోస్టులు పెడుతూ ఉండేది. ఈ ఏడాది ఏప్రిల్‌లో యూఏపీఏ సెక్షన్ కింద ఈ ఖాతా వివరాలు ఇవ్వాలంటూ పోలీసులు 'ఎక్స్'కు నోటీసులు పంపడం అప్పట్లో చర్చనీయాంశమైంది.



# కొండా సురేఖ బర్తరఫ్.. రేవంత్ రెడ్డిని శపించిన ఆమె కుమార్తె సుస్మిత

(మొదటి పేజీ తరువాయి)

ఈ నిర్ణయంపై సురేఖ కుమార్తె సుస్మిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తన తల్లికి అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేస్తూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆమె శాపనార్థాలు పెట్టారు.తల్లి బర్తరఫ్‌పై స్పందించిన సుస్మిత "నా తల్లికి అన్యాయం జరిగింది. ఆమె పట్ల అనుసరించిన తీరు నన్ను తీవ్రంగా బాధించింది. మా అమ్మ గొంతును ఎవరూ నొక్కలేరు. నేను రేవంత్ రెడ్డిని శపిస్తున్నాను" అని వ్యాఖ్యానించారు. అంతేకాకుండా, "నా తల్లి ప్రాతినిధ్యం వహిస్తున్న పరకాల నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని రేవంత్ రెడ్డికి సవాల్ విసురుతున్నాను" అని పేర్కొన్నారు. గతంలో తాను చేసిన వ్యాఖ్యలు కేవలం వ్యక్తిగత హోదాలో ఒక వ్యక్తిని ఉద్దేశించినవే తప్ప, ఏ పార్టీకి వ్యతిరేకం కాదని ఆమె స్పష్టం చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడికి సంబంధించిన ఓ షెల్ కంపెనీకి తక్కువ ధరకు విలువైన భూములను కేటాయించారని సుస్మిత చేసిన ఆరోపణలతో ఈ వివాదం మొదలైంది. దీనికి తోడు, టికెట్ల కేటాయింపులో నగదు ప్రమేయం ఉందంటూ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి. చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యలు ఈ దుమారాన్ని మరింత పెంచాయి. ఈ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ అధిష్ఠానం జోక్యం చేసుకుని, కొండా సురేఖ తొలగింపునకు ఆమోదం తెలిపింది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించడంతో పాటు, చిన్నారెడ్డి నియామకాన్ని కూడా రద్దు చేశారు. ఈ మేరకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాకు సిఫార్సులు పంపారు. తన కుమార్తె చేసిన వ్యాఖ్యలతో తనకు ఎటువంటి సంబంధం లేదని కొండా సురేఖ గతంలోనే ప్రకటించినప్పటికీ, ఆమెపై వేటు తప్పలేదు.

# ములుగు జనరల్ ఆస్పత్రిలో సౌకర్యాలు నిల్.. సమస్యలు ఫుల్!

**వాటర్ ప్లాంట్ ఉన్నా.. ఉపయోగం ఏది?**

గతంలో ఆస్పత్రిలో మంచినీటి సౌకర్యం కోసం వాటర్ ప్లాంట్ ఉండేదని రోగులు చెబుతున్నారు. అయితే ప్రస్తుతం ఆ వాటర్ ప్లాంట్‌ను ఆస్పత్రి నుంచి బయటకు తీసుకెళ్లి పెట్టారని, అక్కడ అది నిరుపయోగంగా ఉందని వారు ఆరోపిస్తున్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు మాత్రం తాగునీటి కోసం ఇబ్బందులు తప్పడం లేదని అంటున్నారు. ఫిర్యాదులు చేసినా ఫలితం లేదంటున్న రోగులుఆస్పత్రిలోని సమస్యలను పలుమార్లు సూపరింటెండెంట్ దృష్టికి తీసుకెళ్లినా తగిన చర్యలు తీసుకోవడం లేదని కొంతమంది రోగులు ఆరోపిస్తున్నారు. సమస్యలు రోజురోజుకూ తీవ్రతరం అవుతున్నా సంబంధిత అధికారులు స్పందించకపోవడంపై వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**ప్రభుత్వం దృష్టి సారించాలి**

ఏజెన్సీ, మారుమూల ప్రాంతాల నుంచి చికిత్స కోసం వచ్చే పేద ప్రజలకు ములుగు జనరల్ ఆస్పత్రి ఎంతో కీలకం. అలాంటి ఆస్పత్రిలోనే కనీస సౌకర్యాలు లేకపోవడం దురదృష్టకరమని ప్రజలు అంటున్నారు.ఇప్పటికైనా ఆస్పత్రి సూపరింటెండెంట్ స్పందించి తాగునీరు, మరుగుదొడ్లు, వాష్‌రూమ్‌లు, ఫ్యాన్లు తదితర కనీస సౌకర్యాలను తక్షణమే అందుబాటులోకి తీసుకురావాలని రోగులు, వారి బంధువులు కోరుతున్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ఆందోళనకు సిద్ధమవుతామని ప్రజా సంఘాల ప్రతినిధులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ములుగు జనరల్ ఆస్పత్రి పరిస్థితిపై సమగ్రంగా పరిశీలించి రోగులకు అవసరమైన వసతులు కల్పించాల్సిన అవసరం ఉంది.

మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం
సెప్టెంబర్ । శుక్రవారం । 4 । 2026



# అలరించిన ఆట పాట పల్లె జానపదాలు.







**డి.డి యాదగిరి ఛానల్ ఆట పాట సీజన్ 4 కు ఆడిషన్స్.**

**మన దునియా, సెప్టెంబర్ 03,మంచిర్యాల జిల్లా**

దూరదర్శన్ యాదగిరి టీవీ ఛానల్ ఆధ్వర్యంలో ఆట పాట సీజన్ 4 పల్లె జానపదాల ఆడిషన్స్ ను మండలంలోని శాంకరి గార్డెన్స్ లో నిర్వహించారు. ఈ అడిషన్ లొ మంచిర్యాల జిల్లాకు చెందిన గాయని, గాయకులు దాదాపు 30మంది పాల్గొన్నారు. పల్లె మట్టి వాసనల నుంచి పుట్టిన జానపదాలను వెలికి తీసి ఎందుకు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న కళాకారులను ప్రోత్సహించేందుకు డిడి యాదగిరి ఛానల్ ద్వారా ఆటపాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా సీజన్ 4 ఆడిషన్స్ ను మంచిర్యాల జిల్లా కళాకారుల కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి కళాకారుడు పల్లె జానపదాలు వారి వారి శైలిలో ఆలపించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. అసలు సిసలైన జానపదాలను పల్లె నుండి సేకరించి పాడిన పాటలు ఆహుతులను ఎంతగానో అలరించాయి. పల్లె పదాలను ప్రపంచానికి పరిచయం చేయాలని సంకల్పంతో కళాకారులు ఉన్న ప్రాంతంలోనే ఆడిషన్స్ నిర్వహిస్తున్నట్లు సెలెక్ట్ కమిటీ సభ్యులు ఉప్పులేటి నరేష్, గడ్డం రమేష్ లు తెలిపారు. ఈ కార్యక్రమానికి న్యాయ నిర్ణేతగా సీనియర్ కళాకారిణి బండ శాంకరి వ్యవహరించగా యాంకర్ గా నాగలక్ష్మి ఆద్యంతం ఆసక్తికరంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాకారులు పాడిన పాటలకు సంగీత సహకారాన్ని డోలక్ హరీష్, దప్పును స్వామి లు అందించగా డిడి యాదగిరి ఛానల్ అధికారులు కెమెరా యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

# పోతననగర్ శ్మశాన వాటికకు ఆధునిక హంగులు కల్పించాలి

**ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని వైనం.. ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు తీసుకెళ్లనున్న స్థానికులు**

**మన దునియా,వరంగల్:సెప్టెంబర్ 03**



వరంగల్ పోతననగర్ హిందూ శ్మశాన వాటికను ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు. కొన్ని ఏళ్లుగా శ్మశాన వాటిక అభివృద్ధికి నోచుకోకపోవడంతో అంతిమ సంస్కారాలకు వచ్చే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇటీవల మున్సిపల్ పాలకవర్గం పదవీకాలం ముగియడంతో సమస్యల పరిష్కారానికి స్థానికులే ముందుకు వచ్చి చొరవ తీసుకోవడం అభినందనీయమని పలువురు పేర్కొంటున్నారు.శ్మశాన వాటిక చుట్టూ ఎత్తైన కాంపౌండ్‌వాల్, ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ప్రధాన ద్వారం నిర్మించాలని ప్రతిపాదిస్తున్నారు. అంతర్గతంగా సీసీ రోడ్లు లేదా పేవర్ బ్లాక్స్ వేయడంతో పాటు నడక మార్గాలు, తగిన విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. పచ్చదనం పెంపొందించేందుకు నీడనిచ్చే, పూల మొక్కలు నాటి ల్యాండ్‌స్కేపింగ్, లాన్ ఏర్పాటు చేయాలని సూచిస్తున్నారు.అంతిమ సంస్కారాలకు వచ్చే బంధువుల కోసం షెడ్లు, పగోడాలు, సిట్టింగ్ బెంచీలు ఏర్పాటు చేయాలని, ఆర్‌వో వాటర్ ప్లాంట్, నిరంతర నీటి సరఫరా కల్పించాలని కోరుతున్నారు. మహిళలు, పురుషులకు వేర్వేరుగా ఆధునిక మరుగుదొడ్లు, చేతులు శుభ్రం చేసుకునే వాష్ ఏరియాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు.పర్యావరణ పరిరక్షణకు పొగ నియంత్రణ వ్యవస్థతో కూడిన ఆధునిక దహన వేదికలు ఏర్పాటు చేయాలని, సాధ్యమైన చోట విద్యుత్ లేదా గ్యాస్ ఆధారిత దహన యంత్రాలను అందుబాటులోకి తీసుకురావాలని ప్రతిపాదిస్తున్నారు. అంతిమ సంస్కారాల సామగ్రి నిల్వకు ప్రత్యేక స్టోర్‌రూమ్, దహనానంతరం స్నానాలకు సురక్షితమైన ప్రక్షాళన ప్రాంతం, దినకర్మలు, అస్థికల సేకరణ తదితర ఆచారాల కోసం ప్రత్యేక ప్రదేశాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.రాత్రివేళ భద్రత కోసం హైమాస్ట్, సోలార్ లైట్లు, ప్రాంగణ పర్యవేక్షణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, వాహనాల కోసం క్రమబద్ధమైన పార్కింగ్ సదుపాయం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. నిరంతర పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక సిబ్బందిని నియమించి, చెత్తబుట్టలు ఏర్పాటు చేయాలని సూచిస్తున్నారు.ఈ అంశాలన్నింటినీ సమగ్రంగా రూపొందించి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యేను కలిసి శ్మశాన వాటిక అభివృద్ధికి నిధులు మంజూరు చేసి పనులు చేపట్టేలా వినతిపత్రం అందజేయాలని స్థానికులు నిర్ణయించారు. ప్రజల అవసరాన్ని గుర్తించి స్థానికులు స్వయంగా ముందుకు రావడం, శ్మశాన వాటిక అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.

# గుడుంబా స్థావరాల పై పోలీసు దాడులు

**మన దునియా,పెద్దపల్లి జిల్లా:సెప్టెంబర్:03**



పెద్దపల్లి జిల్లా మంథని మండల కేంద్రంలోని శివారు ప్రాంతంలో అక్రమం గా నిర్వహిస్తున్న గుడుంబా స్థావరా లపై గురువారం సాయంత్రం మంథని పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ బుద్దే స్వామి,ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు.ఈ దాడుల్లో 2,వేల లీటర్ల గుడుంబాతో పాటు.. బెల్లం పానకం ధ్వంసం చేశారు. గుడుంబా తయారీకి ఉపయోగించే వస్తువులను పాత్రలను, కూడా ధ్వంసం చేశారు. గుడుంబా తయారు చేసే నిర్వాహకుడి కోసం పోలీసులు ఆరా తీస్తున్నారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్స్పెక్టర్ బుద్దె స్వామి, మాట్లాడుతూ.. నాటు సారా తయారు చేసి చట్ట వ్యతిరేక కార్యకలా పాలకు పాల్పడే అలాంటి వారిపై కఠినచర్యలు తీసుకుంటామని బి,స్వామి హెచ్చరించారు.

# నిరుపేద కుటుంబానికి అండగా సాయిని ప్రసాద్ నేత

**మానస వివాహానికి రూ.5 వేల ఆర్థిక సహాయం**

**ఖానాపూర్ ఆర్సి మన దునియా;జన్నారం, సెప్టెంబర్ 3:**



నిరుపేద కుటుంబానికి చెందిన యువతి వివాహానికి ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నాయకుడు, ఎస్సీటీ సంస్థ చైర్మన్, (టి ఎన్ ఎం వి ఎస్, ఓ యు జె ఏ సి) రాష్ట్ర అధ్యక్షులు, బీఆర్ఎస్ యువనాయకుడు సాయిని ప్రసాద్ నేత ఆర్థిక సహాయం అందించి తన మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. చింతగూడ గ్రామానికి చెందిన బిస్కుల రామన్న--సరోజ దంపతుల పెద్ద కుమార్తె మానస వివాహం ఈ నెల 5వ తేదీన జరగనుంది. నిరుపేద కుటుంబం కావడంతో వివాహ ఖర్చులకు చేయూత అందించాలని కోరుతూ ఇటీవల వెలువడిన ఈనాడు కథనానికి స్పందించిన సాయిని ప్రసాద్ నేత.. మానస వివాహ ఖర్చుల నిమిత్తం రూ.5,000 ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ప్రసాద్ నేత మాట్లాడుతూ.. ప్రజా జీవితంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేద కుటుంబాలకు తన వంతు సహాయం అందించడం ఎంతో సంతృప్తినిస్తుందని అన్నారు. ప్రజల ఆశీస్సులతో భవిష్యత్తులో కూడా తమ సంస్థ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని తెలిపారు. మానస వివాహం విజయవంతంగా జరగాలని, నూతన దంపతుల దాంపత్య జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ ఆరే జ్యోతి--శిరీష్ కుమార్, నేతకాని కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తాళ్లపల్లి రాజేశ్వర్, పాత్రికేయ పెద్దలు పూదరి సత్యనారాయణ, తాటి శ్రీనివాస్, ఎస్సీటీ సంస్థ సభ్యులు గట్టు బుజ్జన్న, దుర్గ వినోద్, సాయిని సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

# ఎన్.సి.డబ్ల్యూ.ఏ ఉద్యోగులకు క్వార్టర్ల కౌన్సెలింగ్ నిర్వహణ

**మన దునియా, సెప్టెంబర్ 03,మంచిర్యాల జిల్లా**



మందమర్రి స్థానిక సి.ఈ.ఆర్ క్లబ్ (సి ఈ ఆర్ క్లబ్) ఆవరణలో మందమర్రి ఏరియాకు చెందిన ఎన్.సి.డబ్ల్యూ.ఏ ఉద్యోగులకు సీనియారిటీ ప్రాతిపదికన క్వార్టర్ల కేటాయింపు కౌన్సెలింగ్‌ను గురువారం నిర్వహించారు.ఈ కార్యక్రమం వివరాలను అధికారులు వెల్లడిస్తూ, మొత్తం 105 క్వార్టర్లు అందుబాటులో ఉండగా, వాటి కోసం 88 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. నిబంధనల ప్రకారం సీనియారిటీ ప్రాతిపదికన పారదర్శకమైన పద్ధతిలో కౌన్సెలింగ్ నిర్వహించి, 24 మంది అర్హులైన ఉద్యోగులకు క్వార్టర్లను కేటాయించినట్లు పేర్కొన్నారు.ఈ కౌన్సెలింగ్ సీనియర్ పర్సనల్ ఆఫీసర్ కార్తీక్, ఓఎస్ (పర్సనల్ డిపార్ట్మెంట్) యం. రాయలింగు, మేనేజ్మెంట్ ట్రైనీ సివిల్ ఆర్.వీణ పర్సనల్ డిపార్ట్మెంట్ సిబ్బంది పాల్గొని కేటాయింపు పక్రియను పర్యవేక్షించారు.

## బొల్లారం ఆర్మీ క్యాంపు సమీపంలో డిటోనేటర్ల కలకలం

**మన దునియా,హైదరాబాద్:సెప్టెంబర్ 03**

హైదరాబాద్ లోని మద్రాస్ రెజిమెంట్ ఆర్మీ క్యాంపుకు సమీ పంలో డిటోనేటర్లు కలకలం రేపాయి, ఫైరింగ్ రేంజ్ వెనక గోడ సమీపంలో ఓ ప్లాస్టిక్ బకెట్లో 160 ఎలక్ట్రానిక్ డిటోనే టర్లు లభించడంతో ఆర్మీ సిబ్బంది అప్రమత్తమయ్యారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని వాటిని పరిశీలించా రు. మల్కాజిగిరి బాంబ్ డిస్పోజల్ టీమ్ సూచనల మేరకు డిటోనేటర్లను భద్రపరిచినట్లు సమాచారం. వాటిని అక్కడ ఎవరు వదిలి వెళ్లారు ? ఏదైనా పని లో భాగంగా అక్కడికి తీసుకొచ్చారా ? లేక ఇతర ప్రాంతం నుంచి తరలించి అక్కడ పడేశారా ? అనే కోణాల్లో పోలీసులు ఆరా తీస్తున్నారు. లభ్యమైన డిటోనేటర్ల విలువ సుమారు రూ.32 వేల వరకు ఉంటుందని సమాచా రం. కట్టుదిట్టమైన భద్రతా వ్యవస్థ ఉన్న ఆర్మీ పరిధిలోని మద్రాస్ రెజిమెంట్‌లో ఈ ఘటన చోటుచే సుకోవటం చర్చకు దారితీయగా.. అధికా రులు అప్రమత్తం అయ్యారు. ముఖ్యం గా ఆయుధాల చోరీ కేసు దర్యాప్తు జరుగు తున్న సమయంలోనే డిటోనేటర్లు బయట పడటంతో పోలీసు లు దీనిని సీరియస్ గా తీసుకున్నారు. ఇదిలా ఉండగా.. రెండ్రోజుల క్రితం మద్రాస్ రెజిమెంట్ లోని ఆయుధాలు భద్రపరిచే గది తాళా న్ని గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టి ఆయుధాలు, మందు గుండు సామగ్రిని అపహరించినట్లు ఆర్మీ అధికారులు గుర్తించారు. ఈ ఘటనపై ఆర్మీ అధి కారుల ఫిర్యాదుతో బొల్లారం పోలీస్ స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. రక్షణ వ్యవహారాలకు సంబంధించిన కేసు కావడంతో దర్యాప్తు వివరాలను పోలీసులు గోప్యంగా ఉంచుతున్నట్టు తెలిసింది.



మన దునియా

మన అక్షరం – మన ప్రపంచం

# గవర్నర్ కు చేరిన కొండ సురేఖ బర్తరఫ్ లేఖ?

**మన దునియా,హైదరాబాద్:సెప్టెంబర్ 03**



తెలంగాణ మంత్రి కొండ సురేఖ బర్తరఫ్ కు రంగం సిద్ధమైంది, క్యాబినెట్ నుంచి ఆమెను తొలగించేందుకు కాంగ్రెస్ అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది, కొండా సురేఖ రాజీ నామా చేస్తారా?.. బర్తరఫ్ చేస్తారా అంటూ కొనసాగు తున్న ఉత్కంఠకు తెరపడింది. ఈ మేరకు కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి ఆమోద ముద్ర లభించగానే.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. సురేఖను బర్తరఫ్ చేస్తూ సిఫారసు లేఖను గురువారం గవర్నర్ కు పంపించారు. రాజీనామాకు కొండా సురేఖ అంగీకరించ కపోవడంతో లోక్‌భవన్‌కు సీఎంవో లేఖ పంపించింది. మరోవైపు చిన్నారెడ్డి పై కాంగ్రెస్ అధిష్ఠానం వేటు వేసింది. ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ పదవి నుంచి చెన్నారెడ్డిని తొలగి స్తూ నిర్ణయం తీసు కుంది. ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్ పర్సన్‌గా గద్వాల విజయలక్ష్మి నియ మించారు. మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గా నేరెళ్ల శారద, కాకతీయ అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ చైర్‌పర్సన్ గా గుండు సుధారాణి ని నియమిస్తూ కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంది.

# వైద్యులపై దాడులకు పాల్పడితే బెయిల్ లభించదు

**మన దునియా,న్యూఢిల్లీ:సెప్టెంబర్ 03**



ఢిల్లీ: వైద్యులపై దాడులకు పాల్పడే వాళ్లు బెయిలు పొందేందుకు అర్హులు కాదని సుప్రీంకోర్టు పేర్కొంది. వైద్య సేవలను అందించే వారిపట్ల గౌరవం చూపని వారికి బెయిల్ పొందే అర్హత ఉండదని జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ ఆగస్టీన్ జార్జ్ మసీహ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం స్పష్టం చేసింది.బాంబే హైకోర్టు ఆదేశాలను సవాలు చేస్తూ దాఖలైన అనేక పిటిషన్లకు సంబంధించి విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. థానేలోని మున్సిపల్ ఆసుపత్రి వైద్యులపై దాడికి పాల్పడిన శివసేన కార్పొరేటర్ రమేశ్ మాత్రేకు ట్రయల్ కోర్టు మంజూరు చేసిన బెయిల్ ను హైకోర్టు జులై 18న నిలిపివేసింది. పోలీసులకు లొంగిపోవాల్సిందిగా కార్పొరేటర్ ను ఆదేశించింది.ఆగస్టు 7న రమేశ్ మాత్రేకు, మరికొందరు నిందితులకు హైకోర్టు బెయిల్ మంజూరు చేసినప్పటికీ కఠినమైన షరతులు విధించింది. వీటిని సవాల్ చేస్తూ మాత్రే సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.హైకోర్టు కేసును తనంత తాను విచారణకు చేపట్టడంతోపాటు ట్రయల్ కోర్టు ఇచ్చిన బెయిలుపై స్టే విధించడం పూర్తిగా సమర్థనీయమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.కేసుకు సంబంధించి ఒక మహిళా వైద్యురాలు సహా పలువురు వైద్యులపై దాడి జరిగిందని, ఆ వీడియో వైరల్ అయిందని తెలిపింది. తదుపరి విచారణ ఈ నెల 7వ తేదీకి వాయిదా పడింది.

# ఏసీబీ వలకు చిక్కిన సూర్యాపేట టౌన్ ప్లానింగ్ అధికారి!

**మన దునియా,సూర్యాపేట జిల్లా:సెప్టెంబర్ 03**

ఆదాయానికి మించి న ఆస్తులు ఉన్నాయ నే ఆరోపణల నేప థ్యంలో సూర్యాపేట మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ వి. సోమయ్య నివాసం లో ఏసీబీ అధికారు లు గురువారం ఉదయం మెరుపు దాడులు నిర్వహిం చారు. ఆయన ఇంట్లోనిపలు కీలక డాక్యుమెంట్లు స్వాధీ నం చేసుకున్నారు. ఈ క్రమంలో ఇవ్వాలా ఒకేసారి మూడు ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు ఏకకాలంలో సోదాలు నిర్వహిస్తున్నారు. సూర్యపేట జిల్లా కేంద్రంలోని మానస నగర్లో ఉన్న సోమయ్య నివాసం తో పాటు ఆయన ఆఫీసులోనూ అలాగే హైదరాబాదులోని హయత్ నగర్, సూర్య నగర్ లో ఉన్న సొంత ఇంటి లోనూ ఉదయం నుంచి తనిఖీలు కొనసాగుతున్నాయి.ఈ సోదాల్లో పలు కీలక పత్రాలు అక్రమ ఆస్తులకు సంబంధిం చిన ఆధారాలను అధికారులు సేకరిస్తు న్నట్లు సమాచారం. బ్యాంకు ఖాతాలు, ఆస్తుల వివరాలను నిశితంగా పరిశీలిస్తు న్నారు. కాగా, సోమ య్య మిర్యాలగూడ లో టౌన్ ప్లానింగ్ అధికారిగా పని చేస్తుండగా అక్కడి ఎమ్మెల్యే వద్దంటూ సరెండర్ చేశాడు. దీంతో సోమయ్య పైరవీ చేసి సూర్యా పేట టిపిఓగా ఎఫ్ ఎసి బాధ్యతలు తీసు కొని తదనంతరం ఫుల్ చార్జి తీసుకు న్నట్లు తెలిసింది.



# మంత్రి కొండ సురేఖ పై వేటుకు రంగం సిద్ధం?

**మన దునియా,హైదరాబాద్:సెప్టెంబర్ 03**



తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ పై వెటు వేయడానికి కాంగ్రెస్ అధిష్టానం మొగ్గు చూపుతున్న ట్లు తెలిసింది మంత్రివర్గం నుంచి తొలగించడానికి సానుకూలత వ్యక్తం అవుతున్నట్టు సమా చారం. మంగళ, బుధవారాల్లో కాంగ్రెస్ అధిష్టానంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ముఖ్య నేతలు జరిపిన చర్చల అనంతరం ఈ నిర్ణ యం తీసుకున్నట్లు విశ్వాసనీయవర్గాలు ద్వారా తెలిసింది, తెలంగాణ మంత్రి కొండా సురేఖ విషయంలో కాంగ్రెస్ అధిష్ఠానం అత్యంత కఠిన వైఖరితో ఉన్నట్లు తెలుస్తోంది. ఆమెను మంత్రివర్గం నుంచి తొలగించడం దాదాపు ఖాయమైన ట్లేనని పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోం ది. ఇటీవల పార్టీ నాయకత్వంపై ఆమె చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో వివరణ ఇచ్చేందుకు ఢిల్లీ వెళ్లిన సురేఖకు అక్కడ ఊహించని పరిణామాలు ఎదు రైనట్లు సమాచారం.పార్టీ ప్రధాన కార్య దర్శి కేసీ వేణుగోపాల్ అపాయింట్‌మెంట్ ఇచ్చేందుకు నిరాకరించగా, పార్టీ అధ్యక్షుడు మల్లికార్జు న ఖర్గే కూడా నామ మాత్రంగా మాట్లాడి పంపించేశారని తెలిసింది. అధిష్ఠానం నుంచి ఎలాంటి హామీ లభించకపోవ డంతో తీవ్ర అసం తృప్తితో మంత్రి సురేఖ ఢిల్లీ నుండి వెనుదిరిగారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిపై ఆరో పణలు చేయడంతో ఇక వేటు తప్పదనే నిర్ణయానికి హైక మాండ్ వచ్చినట్లు సమాచారం.మరోవైపు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, రాష్ట్ర వ్యవహా రాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్.. ఢిల్లీలో ఖర్గే, వేణు గోపాల్‌లతో వేర్వేరు గా భేటీ అయ్యారు. సురేఖ వ్యవహారాన్ని తీవ్రమైన క్రమశిక్షణ ఉల్లంఘనగా పరిగణించాలని, అంతర్గత ప్రజాస్వా మ్యంగా చూడవద్దని సీఎం రేవంత్ రెడ్డి అధిష్ఠానాన్ని కోరినట్లు తెలిసింది. ఇదే సమయంలో, ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు పూర్తవుతున్నందున మంత్రివర్గ ప్రక్షాళనకు అనుమతించాలని కూడా ఆయన విజ్ఞప్తి చేసినట్లు సమాచారం. ఆశావాహుల జాబితాతో పాటు నామినేటెడ్ పదవుల భర్తీపై కూడా ఆయన చర్చించినట్లు తెలుస్తోంది.ఈ నెల 7 నుంచి అసెంబ్లీ సమావేశాలు జరగనున్నాయి. ఈ సమావేశాలు ముగిసిన తర్వాత మంత్రివర్గ పునర్వ్య వస్థీకరణ చేపట్టాలని భావిస్తుంది.అదే సమయంలో కొండా సురేఖకు ఉద్వాసన పలకాలని అధిష్ఠానం భావి స్తున్నట్లు ఏఐసీసీ వర్గాల ద్వారా తెలు స్తోంది. ఏ క్షణంలో నైనా ఆమెను బర్తరఫ్ చేసే అవకాశం ఉం దని కూడా ప్రచారం జరుగుతోంది.

# ములుగులో కన్నుల పండువగా బాలగోకులం!





**ములుగు చౌరస్తాలో అలరించిన కృష్ణుడి శోభాయాత్ర**

**కృష్ణుడు, గోపికల వేషధారణలో 1500 మంది విద్యార్థులు**

**15 పాఠశాలల విద్యార్థులతో ఘనంగా బాలగోకులం వేడుకలు**

**బాలల్లో సాంస్కృతిక స్ఫూర్తి నింపడం అభినందనీయం: డీఎస్పీ రవీందర్**

**బాలగోకులంతో బృందావనంలా మారిన ములుగు: మున్సిపల్ కమిషనర్ సంపత్**

**26 ఏళ్లుగా కొనసాగుతున్న బాలగోకులం ములుగు సంస్కృతికి నిదర్శనం: ఆర్ఎస్ఎస్ ప్రచారక్ విగ్నేష్ జీ**

**మన దునియా, ములుగు జిల్లా: సెప్టెంబర్ 03**

శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని ములుగు జిల్లా కేంద్రంలోని లీలా గార్డెన్‌లో ధర్మ జాగరణ సమితి కన్వీనర్ గండ్ర కోట కుమార్ ఆధ్వర్యంలో బాలగోకులం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 15 పాఠశాలలకు చెందిన సుమారు 1500 మంది విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో పాల్గొని ఆకట్టుకున్నారు.

సాధన స్కూల్, బ్రాహ్మణి స్కూల్, సన్‌రైజర్స్ స్కూల్, వెంకటాపూర్ జోహార్ స్కూల్, అరవింద స్కూల్, బిట్స్ స్కూల్, సెయింట్ ఆంథోనీస్ స్కూల్, బ్రిలియంట్ గ్రామర్ స్కూల్, మిరాకిల్ స్కూల్, వివేకవర్ధిని స్కూల్, లిటిల్ ఫ్లవర్ స్కూల్, బండారుపల్లి మోడల్ స్కూల్, జెడ్పీహెచ్‌ఎస్ బండారుపల్లి స్కూల్, భవాని స్కూల్ విద్యార్థులు వేడుకల్లో పాల్గొన్నారు. శోభాయాత్రతో సందడిగా ములుగు కృష్ణుడు, గోపికల వేషధారణలో విద్యార్థులు నిర్వహించిన శోభాయాత్ర ములుగు చౌరస్తాలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చిన్నారుల వేషధారణలు, భక్తి గీతాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది.

బాలల్లో సాంస్కృతిక స్ఫూర్తి గొప్ప విషయం: డీఎస్పీ రవీందర్

కార్యక్రమాన్ని ఉద్దేశించి ములుగు డీఎస్పీ రవీందర్ మాట్లాడుతూ.. బాలల్లో సాంస్కృతిక స్ఫూర్తిని నింపడం గొప్ప విషయమన్నారు. శ్రీకృష్ణుడు ధర్మం, న్యాయం, స్నేహానికి ప్రతీక అని పేర్కొన్నారు. చిన్ననాటి నుంచే పిల్లలకు భారతీయ సంస్కృతి, సంప్రదాయాల విలువలను తెలియజేస్తే వారు భవిష్యత్తులో మంచి పౌరులుగా ఎదుగుతారని అన్నారు. 26 సంవత్సరాలుగా బాలగోకులం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ధర్మ జాగరణ సమితిని అభినందించారు. విద్యార్థులు క్రమశిక్షణతో, ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. ములుగు పట్టణం బృందావనంలా మారింది: కమిషనర్ సంపత్ మున్సిపల్ కమిషనర్ జే. సంపత్ మాట్లాడుతూ.. ములుగు పట్టణంలో ఇంత పెద్ద ఎత్తున బాలగోకులం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థుల వేషధారణలతో పట్టణం మొత్తం బృందావనంలా కనిపించిందని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు పిల్లల్లో దేశభక్తిని, ధర్మం పట్ల అవగాహనను పెంపొందిస్తాయని అన్నారు. కార్యక్రమానికి సహకరించిన పాఠశాలల యాజమాన్యాలు, తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపారు.



విద్యార్థులకు లహరి గ్రూప్ వారు బహుమతులు అందించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా మధు ఫోటో స్టూడియో ఆధ్వర్యంలో ఉచిత ఫోటోగ్రఫీ సౌకర్యం అందించారు. ములుగు సంస్కృతికి నిదర్శనం: విగ్నేష్ విశిష్ట అతిథి, ఆర్ఎస్ఎస్ ప్రచారక్ విగ్నేష్ జీ మాట్లాడుతూ.. ధర్మ జాగరణ అనేది కేవలం ఒక కార్యక్రమం కాదని, మన సంస్కృతిని మేల్కొలిపే ప్రక్రియ అని అన్నారు. శ్రీకృష్ణుడు భగవద్గీత ద్వారా అందించిన సందేశం నేటికీ మార్గదర్శకంగా నిలుస్తోందని పేర్కొన్నారు. చిన్ననాటి నుంచే పిల్లలకు ధర్మం, సంస్కృతి, సంప్రదాయాల విలువలను పరిచయం చేయాల్సిన అవసరం ఉందన్నారు. 26 ఏళ్లుగా నిరంతరాయంగా బాలగోకులం నిర్వహించడం ములుగు గడ్డ గొప్పతనానికి, సంస్కృతికి నిదర్శనమని అన్నారు. పిల్లలే దేశ భవిష్యత్తు అని పేర్కొన్నారు. పలువురు ప్రముఖుల పాల్గొనడంఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ తాళ్ల ఉదయ్ కుమార్, రామగిరి శ్రీనివాస్, ముక్కు సుబ్బారెడ్డి, కొర్ర సుమలత, మేడుదుల మమన్, కుసుమ రాజు, నూనె బిక్షపతి, సముద్రాల వినయ్, చిమట కృష్ణ, కొత్తపల్లి బాబురావు, యాద సంపత్, రాయించు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.అలాగే పాఠశాలల కరస్పాండెంట్లు ముద్దం సంతోష్, తుమ్మ పిచ్చిరెడ్డి, ఎం.డి. ముజీఫ్, దుగ్గిరెడ్డి సురేందర్ రెడ్డి, పెట్టెం రాజు, అక్కల సతీష్, కర్ర రాజేందర్ రెడ్డి, ఏరువ కవిత, కందాల రమేష్, గిరగాని కవిత, భాగవతల నరసింహమూర్తి, ప్రసన్న కుమార్, శ్రీనివాసరావు, తడక సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# పదవి పోయినంక పొలం పనుల్లో బిజీబిజీగా మాజీ మంత్రి చిన్నారెడ్డి !




**మన దునియా,వనపర్తి జిల్లా గోపాల్ పేట:సెప్టెంబర్ 03**

వనపర్తి జిల్లా గోపాల్ పేట మండలం జయన్న తిరుమలాపూర్?లో మాజీ మంత్రి చిన్నారెడ్డి పొలం పనుల్లో నిమగ్నమై కనిపించారు. ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ పదవి నుంచి తనను తొలగించడంపై మాజీ మంత్రి చిన్నారెడ్డి స్పందించారు.తనకు పదవి వ్యామోహం లేదని, చిన్నారెడ్డిగా తనకు ఉండే గుర్తింపు ఉందని ఆయన చెప్పారు. సస్పెన్షన్?పై ఇప్పుడేమీ స్పందించనని చిన్నారెడ్డి వ్యాఖ్యానించారు.ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జి. చిన్నారెడ్డికి ప్రభుత్వం ఉద్వాసన పలికిన సంగతి తెలిసిందే. ఆయనను ఆ పదవి నుంచి తొలగిస్తున్నట్లు సీఎంవో ప్రకటించింది. చిన్నారెడ్డి స్థానంలో గద్వాల విజయలక్ష్మిని ప్రణాళిక సంఘం ఉపాధ్యక్ష పదవిలో నియమించింది. వనపర్తి నియోజకవర్గంలోని గోపాల్‌పేట సభలో స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డిపై, పార్టీ హైకమాండ్‌పై చిన్నారెడ్డి పలు ఆరోపణలు చేయడంతో ఆయనపై వేటు పడింది.వనపర్తి నియోజకవర్గాన్ని నాశనం చేస్తున్నారని చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. అన్నీ చూస్తూ భరిస్తున్నానని.. లేకపోతే జీవన్ రెడ్డిలా ఎప్పుడో పార్టీ మారేవాడినంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు పార్టీలో కలకలం రేపాయి. అధిష్ఠానం తనకు టికెట్ ఇవ్వమని చెప్పినా.. రాష్ట్రంలో అడ్డుకున్నారని.. కాంగ్రెస్ పార్టీని స్వార్థంతో కూలగొట్టటానికి ప్రయత్నిస్తున్నారని ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదానికి కారణమయ్యాయి. కొంత మంది డబ్బులకు ఆశపడి తనకు అన్యాయం చేస్తున్నారని.. అన్నింటికీ కాలమే సమాధానం చెబుతుందని చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర నాయకత్వంతో పాటు అధిష్ఠానం కూడా ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ పరిణామాల క్రమంలోనే ఆయనను ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ పదవి నుంచి తొలగిస్తున్నట్లు ప్రభుత్వం గురువారం ప్రకటించింది.

# వార్త రాయాలంటే అధికార పార్టీ అనుమతి తీసుకోవాలా...?

**పెద్దకోడెపాక భూముల కథనంపై ఎందుకింత ఉలికిపాటు..?**

**బాధితురాలి వాంగ్మూలంతో వార్త రాస్తే బెదిరింపులెందుకు...?**

**"ఎదుటివారి వివరణ తీసుకోవాలి" అంటూ పాత్రికేయులపై ఒత్తిడి తేవడమేంటి ..?**

**పత్రికలకు వార్త రాసే హక్కు లేదా అంటూ ప్రజల్లో చర్చ**

**మన దునియా,శాయంపేట:సెప్టెంబర్ 03:**

హనుమకొండ జిల్లా శాయంపేట మండలంలోని పెద్దకోడెపాక శివారులోని సర్వే నంబర్ 632 భూమికి సంబంధించిన వివాదంపై ప్రచురితమైన వార్త స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.తమ సమస్యను నన్నెబోయిన రజిత ఆవేదనతో మీడియా దృష్టికి తీసుకురావడంతో,ఆమె వెల్లడించిన అంశాలు,వాంగ్మూలం ఆధారంగా వార్త ప్రచురించినట్లు తెలుస్తోంది.అయితే ఈ కథనంపై కొంతమంది అధికార పార్టీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ పాత్రికేయులను పిలిచి "ఎదుటివారి వివరణ తీసుకుని వార్త రాయాలి"అని బెదిరించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఈ పరిణామం నేపథ్యంలో వార్త రాయడానికి ముందు రాజకీయ నాయకుల అనుమతి తీసుకోవాల్సిన పరిస్థితి కల్పిస్తున్నారా ..? అన్న ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి. బాధితుల వాంగ్మూలం వార్త కాదా..?ప్రజలు తమ సమస్యలు,అన్యాయాలు,భూ వివాదాలను మీడియా దృష్టికి తీసుకురావడం సాధారణమే.అలాంటి ఫిర్యాదులను పరిశీలించి,అందుబాటులో ఉన్న ఆధారాలు,సంబంధిత పత్రాలు, వాంగ్మూలాల ఆధారంగా వార్తను ప్రజల ముందుకు తీసుకురావడం పత్రికల బాధ్యత.ఐతే పాత్రికేయులను పిలిచి బెదిరించాల్సిన పరిస్థితి ఎందుకు వెళ్లిందన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది.

భూమి కథనంపై ఇంత ఆందోళన ఎందుకు..?

సర్వే నంబర్ 632 భూమిపై వార్త వెలువడిన వెంటనే కొంతమంది నాయకులు తీవ్రంగా స్పందించాల్సిన అవసరం ఏమొచ్చిందన్న ప్రశ్నలు ప్రజల్లో వినిపిస్తున్నాయి.వార్తలో తమ వాదనకు అవకాశం ఇవ్వాలనే ఉద్దేశమా..? లేక భూ వ్యవహారంపై కథనాలు వెలువడకూడదనే అభిప్రాయమా..? అన్నది స్పష్టత రావాల్సి ఉంది. నిజంగా వార్తలో వాస్తవాలు తప్పుగా ఉంటే వాటిని ఖండించేందుకు సంబంధిత వ్యక్తులకు అన్ని అవకాశాలు ఉన్నాయి. ఆధారాలతో వాస్తవాలను ప్రజల ముందుంచడం ద్వారా అపోహలకు తెరదించవచ్చు. కానీ పాత్రికేయులపై ఒత్తిళ్లు,బెదిరింపుల ఆరోపణలు రావడం మాత్రం ప్రజాస్వామ్య వ్యవస్థలో ఆందోళన కలిగించే అంశమేనని పలువురు అభిప్రాయపడుతున్నారు.సర్వే నంబర్ 632 అసలు కథేంటి..?ఇక అసలు ప్రశ్న భూమి విషయంలోనే ఉంది.సర్వే నంబర్ 632 భూమి హక్కుదారులు ఎవరు..? రెవెన్యూ రికార్డుల్లో భూమి స్వరూపం ఏమిటి..?భూమికి సంబంధించిన పాత రికార్డులు ఏం చెబుతున్నాయి..? ప్రస్తుతం ఎవరి ఆధీనంలో ఉంది..? అనే అంశాలపై రెవెన్యూ అధికారులు సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది.రికార్డులు, సర్వే వివరాలు,హక్కు పత్రాలను పరిశీలించి అధికారికంగా వాస్తవాలను వెల్లడిస్తే ఈ వివాదానికి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.




మీడియాను అడ్డుకోవడం కాదు వాస్తవాలను బయటపెట్టాలి...

భూ వ్యవహారాలపై ఆరోపణలు వచ్చినప్పుడు పాత్రికేయులను ప్రశ్నించడం కంటే,అసలు వాస్తవాలను అధికారిక రికార్డులతో ప్రజల ముందుంచడం మేలని ప్రజలు అంటున్నారు.మండల పరిధిలో భూములకు సంబంధించిన వివాదాలు,ఆక్రమణల ఆరోపణలు, రికార్డులపై అనుమానాలు ఏమైనా ఉంటే రెవెన్యూ అధికారులు నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని కోరుతున్నారు. బాధితుడి గోడు వినిపించకూడదా..? పాత్రికేయుడు ప్రశ్నించకూడదా..? వార్త రాయడానికి రాజకీయ అనుమతి అవసరమా..? అనే ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సింది పాత్రికేయులు కాదు ప్రజాప్రతినిధులు,అధికారులు. ఆరోపణలు నిజమైతే విచారణతో తేలాలి..అవాస్తవాలైతే ఆధారాలతో ఖండించాలి.కానీ వార్తను ఆపే ప్రయత్నాల కంటే వాస్తవాలను వెలుగులోకి తీసుకురావడమే ప్రజాస్వామ్యానికి నిజమైన గౌరవం అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## వీధి కుక్కల దాడిలో వృద్ధుడి దుర్మరణం

**ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో ఐదు కుక్కల దాడి.. ఘటనా స్థలంలోనే మృతి**

**మన దునియా దండేపల్లి,సెప్టెంబర్ 03:**



దండేపల్లి: వీధి కుక్కల దాడిలో ఓ వృద్ధుడు దారుణంగా మృతి చెందిన విషాద ఘటన దండేపల్లి మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికంగా తీవ్ర కలకలం రేపిన ఈ ఘటనతో గ్రామస్థులు భయాందోళనకు గురయ్యారు.దండేపల్లి మండల కేంద్రానికి చెందిన ఒరగంటి పోషం (80) గత కొంతకాలంగా వృద్ధాప్యం, అనారోగ్య సమస్యలతో బాధపడుతూ లేవలేని స్థితిలో మంచానికే పరిమితమయ్యాడు. ఈ క్రమంలో గురువారం ఇంట్లో కుటుంబ సభ్యులు ఎవరూ లేని సమయంలో ఐదు వీధి కుక్కలు ఒక్కసారిగా ఇంట్లోకి ప్రవేశించి పోషంపై దాడి చేసినట్లు స్థానికులు తెలిపారు.కుక్కలు విచక్షణారహితంగా దాడి చేసి శరీరమంతా తీవ్రంగా కొరకడంతో పోషం తీవ్ర గాయాలపాలై ఘటనా స్థలంలోనే మృతి చెందినట్లు సమాచారం. కుటుంబ సభ్యులు ఇంటికి చేరుకునే సమయానికి ఆయన మృతి చెంది ఉండటంతో విషాదఛాయలు అలుముకున్నాయి.

**కుక్కల బెడదపై ఆగ్రహం**

దండేపల్లి మండల కేంద్రంలో వీధి కుక్కల సంచారం రోజురోజుకూ పెరుగుతోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులు, వృద్ధులు, ఒంటరిగా వెళ్లే ప్రజలు కుక్కల బెడదతో భయపడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి కుక్కల నియంత్రణకు తక్షణ చర్యలు చేపట్టాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. మరో ప్రాణం బలికాకముందే సంబంధిత అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

## సమయపాలన పాటించని దేవనగర్ కార్యదర్శి..!

- **"నేనొక్కదాన్నే ఉన్నానా?" అంటూ నిర్లక్ష్య సమాధానం**
- **ఉదయం 11 గంటలకు విధులకు హాజరు.. మధ్యాహ్నం 12:30కే వెళ్లిపోతున్నారనే ఆరోపణలు**
- **జిల్లా మొత్తంలో అందరు కార్యదర్శులు ఇలానే వస్తూ పోతున్నారంటూ వాదన**
- **ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన కార్యాలయంలో వేళలపై నిర్లక్ష్యం ఎందుకు?**
- **ఉన్నతాధికారులు స్పందించి సమయపాలనపై చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్**



**మన దునియా,మల్లంపల్లి,దేవ నగర్:సెప్టెంబర్ 03**




ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాల్సిన అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో సమయపాలన పాటించాల్సి ఉంటుంది. కానీ దేవనగర్ కార్యదర్శి వ్యవహారశైలి ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.స్థానికుల ఆరోపణల ప్రకారం.. కార్యదర్శి నిర్ణీత సమయానికి కార్యాలయానికి హాజరు కాకుండా ఆలస్యంగా వస్తున్నారని, కొద్దిసేపటికే తిరిగి వెళ్లిపోతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఉదయం 11 గంటలకు కార్యాలయానికి వచ్చి, మధ్యాహ్నం 12:30 గంటలకే వెళ్లిపోతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.ఈ విషయంపై ప్రశ్నించగా.. "నేనొక్కదాన్నే ఉన్నానా? జిల్లా మొత్తంలో అందరు కార్యదర్శులు ఇలానే వచ్చి వెళ్తున్నారు" అంటూ సమాధానం ఇచ్చినట్లు సమాచారం.అయితే ఒకరి తప్పును మరొకరి ఉదాహరణగా చూపించడం సమయపాలనకు సమర్థన అవుతుందా? ప్రజల పనుల కోసం కార్యాలయానికి వచ్చే వారికి అధికారులు అందుబాటులో లేకపోతే వారి పరిస్థితి ఏమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.దేవనగర్ కార్యదర్శి విధులకు హాజరయ్యే సమయం, కార్యాలయంలో ఉండే సమయం తదితర అంశాలపై సంబంధిత ఉన్నతాధికారులు హాజరు రికార్డులు, బయోమెట్రిక్ వివరాలు ఉంటే వాటిని పరిశీలించి వాస్తవాలను నిర్ధారించాలని స్థానికులు కోరుతున్నారు.జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉందన్న వ్యాఖ్యలపైనా అధికారులు దృష్టి సారించి, ప్రభుత్వ కార్యాలయాల్లో సమయపాలన, ప్రజలకు అందుబాటు, విధి నిర్వహణపై పర్యవేక్షణ పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

# ఆటగాళ్ల గాయాలకు చెక్.. బీసీసీఐ పకడ్బందీ ప్లాన్

**గాయాల నివారణకు ఎఫ్‌టీపీలో మార్పులు చేయనున్న బీసీసీఐ**

**ఆటగాళ్లకు తగిన విశ్రాంతి కల్పించడంపై దృష్టి**

**రిటర్న్ టు ప్లే నిబంధనలను బీసీసీఐ సమీక్ష**

**ఫిట్‌నెస్ సాధించిన తర్వాతే జాతీయ జట్టులోకి అనుమతి**

**సీఓఈలో 16 మంది ఫిట్‌నెస్, రిహాబ్ నిపుణులు**



భారత క్రికెటర్లను వెంటాడుతున్న గాయాల సమస్యపై బీసీసీఐ దృష్టి సారించింది. వరుసగా అంతర్జాతీయ మ్యాచ్‌లు, ఐపీఎల్ వంటి ఫ్రాంచైజీ టోర్నీలు ఆడాల్సి రావడం ఆటగాళ్లపై తీవ్ర ప్రభావం చూపుతోందని బోర్డు గుర్తించింది. ఈ సమస్యకు పరిష్కారం చూపేందుకు 'భవిష్యత్ పర్యటనల ప్రణాళిక' (ఎఫ్‌టీపీ)లో మార్పులు చేయాలని నిర్ణయించింది.ముంబైలో గురువారం జరిగిన సమీక్షా సమావేశం తర్వాత బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా ఈ విషయాన్ని వెల్లడించారు. టెస్టు, వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్, టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ సమావేశంలో పాల్గొన్నారు. ఆటగాళ్లకు తగిన విశ్రాంతి లభించేలా భవిష్యత్ షెడ్యూల్‌ను రూపొందించడంపై చర్చించారు.ఇంగ్లాండ్ పర్యటనకు ముందు ఆటగాళు రెండు నెలల పాటు ఐపీఎల్‌లో ఆడారని సైకియా గుర్తుచేశారు. ఆ తర్వాత అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడటంతో పలువురు గాయపడ్డారని చెప్పారు. ఇకపై ఇలాంటి పరిస్థితులు రాకుండా ఎఫ్‌టీపీలో మార్పులు చేయాల్సిన అవసరం ఉందన్నారు.ఆటగాడు గాయం నుంచి కోలుకున్న తర్వాత తిరిగి జట్టులోకి రావడానికి ఉన్న నిబంధనలను కూడా సమీక్షించారు. సొంత ఫిజియో పర్యవేక్షణలో గానీ, బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ)లో గానీ పునరావాసం పూర్తి చేయాల్సి ఉంటుంది. పూర్తి ఫిట్‌నెస్ సాధించిన తర్వాతే అంతర్జాతీయ క్రికెట్‌కు అనుమతిస్తారు.గాయాల విషయంలో వ్యక్తిగత ఆటగాళ్లపై ఎలాంటి చర్చ జరగలేదని సైకియా స్పష్టం చేశారు. ఆటగాళ్ల ఫిట్‌నెస్, పునరావాసానికి సంబంధించిన విధానాలపైనే సమావేశంలో చర్చ జరిగిందన్నారు. కెప్టెన్లు, కోచ్ నుంచి సలహాలు తీసుకుని కొత్త వ్యూహాన్ని సిద్ధం చేస్తున్నామని చెప్పారు.సీఓఈలో స్పోర్ట్స్ సైన్స్ విభాగం అధిపతి పదవి ఖాళీగా ఉన్నా కార్యకలాపాలకు ఇబ్బంది లేదన్నారు. ప్రస్తుతం 16 మంది నిపుణులు ఫిట్‌నెస్, రిహాబ్, ప్రీహాబ్ కార్యక్రమాలను చూస్తున్నారని తెలిపారు. అత్యున్నత అర్హతలు ఉన్న వ్యక్తి కోసం ప్రపంచవ్యాప్తంగా అన్వేషణ కొనసాగుతోందన్నారు.తదుపరి ఎఫ్‌టీపీలో కీలక మార్పులు చేయాలని బీసీసీఐ సిబ్బందికి ఆదేశాలు ఇచ్చినట్లు సైకియా చెప్పారు. ముఖ్యంగా విదేశీ పర్యటనలకు ముందు ఆటగాళ్లకు విశ్రాంతితో పాటు అక్కడి పరిస్థితులకు అలవాటు పడేందుకు ప్రాక్టీస్ మ్యాచ్‌లు ఉండేలా షెడ్యూల్ రూపొందించనున్నట్లు తెలిపారు.

# రోహిత్ శర్మ రిటైర్మెంట్‌పై బీసీసీఐ క్లారిటీ..!

**రోహిత్ రిటైర్మెంట్ రూమర్స్‌పై బీసీసీఐ క్లారిటీ**

**రోహిత్ అద్భుతంగా ఆడుతున్నాడన్న సైకియా**

**వన్డే జట్టులో స్థానానికి తక్షణ ముప్పు లేదని సంకేతాలు**

**లార్డ్స్‌లో రోహిత్ సెంచరీతో మారిన సమీకరణాలు**

**బీసీసీఐ సమీక్ష అనంతరం సైకియా కీలక వ్యాఖ్యలు**



రోహిత్ శర్మ వన్డే భవిష్యత్తుపై వస్తున్న ఊహాగానాలకు బీసీసీఐ చెక్ పెట్టింది. టీమిండియా మాజీ కెప్టెన్ అద్భుతంగా ఆడుతున్నాడని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా స్పష్టం చేశారు. రోహిత్ భవిష్యత్తుపై అనవసరమైన ఊహాగానాలకు ఆజ్యం పోయొద్దని సూచించారు. దీంతో ప్రస్తుతానికి వన్డే జట్టులో రోహిత్ స్థానానికి ఎలాంటి ముప్పు లేదన్న సంకేతాలు వెలువడ్డాయి.గురువారం ముంబైలో జరిగిన బీసీసీఐ ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం అనంతరం సైకియా ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సమావేశానికి హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్, టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్, కార్యదర్శి దేవజిత్ సైకియా హాజరయ్యారు. అయితే చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ సమావేశానికి రాలేదు. ఆయన పదవీకాలం అక్టోబర్‌లో ముగియనుంది. 39 ఏళ్ల రోహిత్ శర్మ రిటైర్మెంట్‌పై కొంతకాలంగా వరుసగా వార్తలు వస్తున్నాయి. ముఖ్యంగా 2027 వన్డే ప్రపంచకప్ నాటికి అతడి వయసు 40కి చేరనుండటంతో భవిష్యత్తుపై చర్చ జరుగుతోంది. ఇటీవల ఇంగ్లండ్ పర్యటనలో లార్డ్స్ వన్డేనే రోహిత్‌కు చివరి మ్యాచ్ కావచ్చనే ప్రచారం కూడా జరిగింది. అయితే ఆ మ్యాచ్‌లో రోహిత్ అద్భుతమైన సెంచరీ సాధించాడు. భారత్ ఓడినప్పటికీ తన బ్యాట్‌తోనే విమర్శలకు సమాధానం ఇచ్చాడు.రోహిత్ కూడా తన కెరీర్‌పై వస్తున్న రూమర్స్‌పై గతంలో స్పందించాడు. బయట ఎలాంటి చర్చ జరిగినా తన దృష్టి మాత్రం మైదానంలో జట్టు విజయానికి సహకరించడంపైనే ఉంటుందని స్పష్టం చేశాడు. ప్రస్తుతం బీసీసీఐ కూడా రోహిత్ అనుభవం, ప్రదర్శనలకే ప్రాధాన్యం ఇస్తున్నట్లు సైకియా వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి. అయితే 2027 ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని భవిష్యత్ ఓపెనర్లను సిద్ధం చేసే ప్రక్రియ మాత్రం కొనసాగనుంది. యశస్వి జైస్వాల్ సహా ఇతర ఆటగాళ్లను సెలెక్టర్లు పరిశీలించే అవకాశం ఉంది.

## సెంచరీతో స్మృతి మంధాన రికార్డుల మోత.. మహిళల క్రికెట్‌లో సరికొత్త చరిత్ర!

**హాంకాంగ్‌పై 64 బంతుల్లో 124 పరుగులు**

**మహిళల అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక పరుగుల రికార్డు**

**అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక సెంచరీలు సాధించిన మహిళా క్రికెటర్‌గా ఘనత**




దుబాయ్ వేదికగా జరుగుతున్న మహిళల ఆసియా కప్ 2026లో భారత స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన సంచలనం సృష్టించింది. హాంకాంగ్‌తో జరిగిన గ్రూప్-ఏ మ్యాచ్‌లో అద్భుతమైన సెంచరీతో చెలరేగిన ఆమె, పలు రికార్డులను బద్దలు కొట్టింది. ఈ ఇన్నింగ్స్‌తో మహిళల అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా స్మృతి సరికొత్త చరిత్ర లిఖించింది. ఇప్పటివరకు అగ్రస్థానంలో ఉన్న భారత లెజెండరీ క్రికెటర్ మిథాలీ రాజ్‌ను ఆమె అధిగమించింది.ఈ మ్యాచ్‌లో స్మృతి కేవలం 64 బంతుల్లో 14 ఫోర్లు, 7 భారీ సిక్సర్లతో 124 పరుగులు చేసింది. ఈ సెంచరీతో అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక శతకాలు నమోదు చేసిన మహిళా క్రికెటర్‌గా కూడా ఆమె రికార్డు సృష్టించింది. ఆమె విధ్వంసకర బ్యాటింగ్‌తో టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 193 పరుగుల భారీ స్కోరు సాధించింది.అంతకుముందు టాస్ గెలిచిన హాంకాంగ్ కెప్టెన్ నటాషా మైల్స్ ఫీల్డింగ్ ఎంచుకుంది. అయితే, ఆరంభం నుంచే స్మృతి మంధాన దూకుడుగా ఆడి స్కోరు బోర్డును పరుగులు పెట్టించింది. ఆమె అద్భుత ప్రదర్శనతో భారత జట్టు పటిష్ఠ స్థితిలో నిలిచింది.

## 350తో చరిత్ర.. పుజారా 13 ఏళ్ల రికార్డు బద్దలు కొట్టిన బంగ్లాదేశ్ బ్యాటర్

**హృదోయ్ 350 నాటౌట్‌తో అద్భుత రికార్డు**

**బంగ్లాదేశ్ ఫస్ట్‌క్లాస్ అత్యధిక స్కోరు ఇదే**

**పుజారా 306 రికార్డును అధిగమించిన హృదోయ్**

**'ఏ' జట్లలో అత్యధిక వ్యక్తిగత స్కోరు**

**దక్షిణాఫ్రికాలో విదేశీ బ్యాటర్ అత్యధిక స్కోరు**

బంగ్లాదేశ్ యువ బ్యాటర్ తౌహిద్ హృదోయ్ ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో సంచలనం సృష్టించాడు. దక్షిణాఫ్రికా 'ఏ'తో జరుగుతున్న అనధికారిక టెస్టులో ఏకంగా 350 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. 481 బంతుల్లో 27 ఫోర్లు, 10 సిక్సర్లతో ఈ అద్భుత ఇన్నింగ్స్ ఆడాడు. దీంతో ఒకే ఇన్నింగ్స్‌లో పలు రికార్డులు బద్దలయ్యాయి.పొట్చెఫ్‌స్ట్రూమ్‌లో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో 37/2 స్కోరు వద్ద క్రీజులోకి వచ్చిన హృదోయ్ ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడ్డాడు. అతడి 350 పరుగులతో బంగ్లాదేశ్ బ్యాటర్ ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో సాధించిన అత్యధిక వ్యక్తిగత స్కోరు నమోదైంది. 2020లో బంగ్లాదేశ్ క్రికెట్ లీగ్‌లో తమీమ్ ఇక్బాల్ చేసిన 334 నాటౌట్ రికార్డును హృదోయ్ అధిగమించాడు.'ఏ' జట్ల తరఫున అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించిన ఆటగాడిగానూ హృదోయ్ నిలిచాడు. 2013లో ఇండియా 'ఏ' తరఫున వెస్టిండీస్ 'ఏ'పై చటేశ్వర్ పుజారా 306 పరుగులు చేశాడు. 13 ఏళ్లుగా ఉన్న ఆ రికార్డును హృదోయ్ 350తో బద్దలు కొట్టాడు. స్వదేశానికి దూరంగా అనధికారిక మ్యాచ్‌లో 'ఏ' జట్టు తరఫున ట్రిపుల్ సెంచరీ చేసిన తొలి బ్యాటర్‌గానూ రికార్డు నెలకొల్పాడు.దక్షిణాఫ్రికాలో ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లో విదేశీ బ్యాటర్ సాధించిన అత్యధిక స్కోరు రికార్డు కూడా హృదోయ్ సొంతమైంది. 1948లో ఇంగ్లండ్ దిగ్గజం డెనిస్ కాంప్టన్ ఎంసీసీ తరఫున నార్త్ ఈస్టర్న్ ట్రాన్స్‌వాల్‌పై 300 పరుగులు చేశాడు. 78 ఏళ్లుగా ఉన్న ఆ రికార్డును హృదోయ్ అధిగమించాడు.హృదోయ్ భారీ ఇన్నింగ్స్‌తో బంగ్లాదేశ్ 'ఏ' జట్టు 676/8 వద్ద తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. జాకర్ అలీ 94, మహ్మద్ సైఫుద్దీన్ 87 పరుగులతో రాణించారు. అంతకుముందు దక్షిణాఫ్రికా 'ఏ' జట్టు 512 పరుగులు చేసింది. నవంబర్‌లో దక్షిణాఫ్రికాతో బంగ్లాదేశ్ రెండు టెస్టుల సిరీస్ ఆడనుంది. ఆ సిరీస్‌కు ఈ అనధికారిక టెస్టు మంచి సన్నాహకంగా భావిస్తున్నారు. ఆస్ట్రేలియా గడ్డపై ఇటీవల సిరీస్‌ను డ్రా చేసుకున్న బంగ్లాదేశ్.. డబ్ల్యూటీసీ 2025-27 పట్టికలో నాలుగో స్థానానికి చేరింది.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

# ‘యేషనాగుల’ దుమ్మురేపుతోంది.. యూట్యూబ్‌లో అదిరిపోయే రికార్డు!

**‘యేషనాగుల’కు ఐదు రోజుల్లో 50 మిలియన్ వ్యూస్**

**అత్యంత వేగంగా ఈ మైలురాయి చేరిన తెలుగు పాటగా రికార్డు**

**యూట్యూబ్ గ్లోబల్ చార్టుల్లో నంబర్ వన్ ట్రెండింగ్**

**సోషల్ మీడియాలోనూ పాటకు భారీ స్పందన**

**పాటలో కనిపించిన నాని, కీర్తి సురేశ్**




నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న ‘ది ప్యారడైజ్’ సినిమాపై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. తాజాగా ఈ చిత్రంలోని రెండో పాట ‘యేషనాగుల’ మరో సంచలనం సృష్టించింది. విడుదలైన ఐదు రోజుల్లోనే 50 మిలియన్లకు పైగా వ్యూస్ సాధించిన తొలి తెలుగు పాటగా రికార్డు సృష్టించిందని చిత్రబృందం ప్రకటించింది. ‘యేషనాగుల’ పాట ఆగస్టు 29న విడుదలైంది. తెలంగాణ జానపద బాణీకి ఆధునిక టచ్ జోడించిన ఈ పాటకు మంచి స్పందన వస్తోంది. పాట విడుదలైన కొద్దిరోజుల్లోనే యూట్యూబ్‌తో పాటు సోషల్ మీడియాలోనూ ట్రెండ్‌గా మారింది. నాని, కీర్తి సురేశ్ కనిపించే ఈ పాటకు అభిమానులు భారీగా స్పందిస్తున్నారు.

గ్లోబల్ చార్టుల్లోనూ దూకుడు

‘యేషనాగుల’ యూట్యూబ్ గ్లోబల్ చార్టుల్లో నంబర్ వన్ ట్రెండింగ్‌లో ఉందని ‘ది ప్యారడైజ్’ అధికారిక ఖాతా వెల్లడించింది. ఐదు రోజుల్లో 50 మిలియన్ల మార్క్‌ను దాటడం విశేషంగా మారింది. సోషల్ మీడియాలో ఈ పాటకు సంబంధించిన రీల్స్, డ్యాన్స్ వీడియోలు కూడా వైరల్ అవుతున్నాయి.పాటకు అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించారు. కాసర్ల శ్యామ్ సాహిత్యం రాశారు. ప్రభా బంగారిగల్ల, అడ్డుల జంగిరెడ్డి పాడారు. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందుతున్న ‘ది ప్యారడైజ్’లో నాని కీలక పాత్రలో నటిస్తున్నారు. ఈ పాట విడుదల సమయంలో అనిరుధ్ రవిచందర్ డల్లాస్ కచేరీలో నాని వేదికపైకి వచ్చి సందడి చేయడం కూడా అభిమానుల్లో ఆసక్తిని పెంచింది.

# ‘కల్కి’ సినిమాలో ఆఫర్ అంటూ ప్రచారం.. చిత్ర బృందం కీలక హెచ్చరిక

**ఫేక్ కాస్టింగ్ కాల్స్‌పై ‘కల్కి’ మేకర్స్ హెచ్చరిక**

**థర్డ్ పార్టీ కాస్టింగ్ ఏజెన్సీలకు అనుమతి లేదని స్పష్టీకరణ**

**వ్యక్తిగత వివరాలు ఇవ్వొద్దని సూచన**

**ఆడిషన్ మెటీరియల్ పంపొద్దని హెచ్చరిక**

**ఎవరికి డబ్బులు చెల్లించొద్దని విజ్ఞప్తి**

‘కల్కి 2898 ఏడీ’ సినిమా పేరుతో జరుగుతున్న నకిలీ కాస్టింగ్ కాల్స్‌పై చిత్రబృందం అప్రమత్తం చేసింది. తమ ప్రతినిధులమంటూ కొందరు వ్యక్తులు, సంస్థలు ఆడిషన్స్, కాస్టింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రచారం చేస్తున్నారని తెలిపింది. ఇలాంటి వారిని నమ్మొద్దని ప్రజలను కోరింది. ఈ మేరకు ప్రముఖ నిర్మాణ సంస్థ వైజయంతీ మూవీస్ గురువారం సోషల్ మీడియా ద్వారా కీలక ప్రకటన విడుదల చేసింది. తాము ఎలాంటి థర్డ్ పార్టీ ఏజెన్సీ, కంపెనీ, వ్యక్తి లేదా కాస్టింగ్ ప్రతినిధిని ఆడిషన్స్, కాస్టింగ్ కోసం నియమించలేదని స్పష్టం చేసింది. తమ పేరుతో ఎవరైనా కాస్టింగ్ అవకాశాలు కల్పిస్తామంటూ సంప్రదిస్తే వ్యక్తిగత వివరాలు, ఆడిషన్ మెటీరియల్ ఇవ్వొద్దని మేకర్స్ సూచించారు. ముఖ్యంగా ఎలాంటి చెల్లింపులు చేయవద్దని హెచ్చరించారు. తమ సంస్థ పేరును అనధికారికంగా ఉపయోగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునే హక్కు తమకు ఉందని స్పష్టం చేశారు. ‘కల్కి 2898 ఏడీ’కు సంబంధించిన అధికారిక సమాచారం కోసం వైజయంతీ మూవీస్ అధికారిక సోషల్ మీడియా ఖాతాలను మాత్రమే నమ్మాలని చిత్రబృందం సూచించింది. ప్రభాస్, అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ తదితర అగ్ర తారలు నటించిన ఈ చిత్రానికి నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించారు. భారీ విజయం సాధించిన తొలి భాగం 72వ జాతీయ చలనచిత్ర అవార్డుల్లో రెండు పురస్కారాలను దక్కించుకుంది. ఉత్తమ ప్రజాదరణ పొందిన వినోదాత్మక చిత్రంగా అవార్డు రావడంతో పాటు బెస్ట్ ప్రొడక్షన్ డిజైనర్ విభాగంలోనూ పురస్కారం లభించింది.





# నా రిటైర్మెంట్ దగ్గరపడిందేమో అని కుటుంబ సభ్యులతో చెప్పాను: తాప్సీ

**కొన్ని రకాల సినిమాలు, మార్కెట్ ధోరణిలపై తాప్సీ విమర్శలు**

**కథల ఎంపికలో కాంప్రమైజ్ కాకూడదని వ్యాఖ్య**

**ఎలాంటి స్క్రిప్ట్ కైనా ఓకే చెప్పే స్థితిలో లేనని వెల్లడి**

ప్రముఖ కథానాయిక తాప్సీ కొంత కాలంగా పూర్తిగా బాలీవుడ్ పైనే దృష్టి సారించిన సంగతి తెలిసిందే. తాప్సీ ప్రధాన పాత్రలో నటించిన సస్పెన్స్ యాక్షన్ థ్రిల్లర్ ‘గాంధారి’ ఈరోజు నుంచి ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. దేవాశిష్ మఖీజా దర్శకత్వంలో, కనికా థిల్లాన్ నిర్మించిన ఈ చిత్రంలో ప్రమాదకర పరిస్థితులను ఎదుర్కొంటూ తన బిడ్డ కోసం పోరాడే పవర్‌ఫుల్ తల్లి పాత్రలో తాప్సీ కనిపించారు. ఇష్వాక్ సింగ్, జతిన్ సర్నా, స్వస్తికా ముఖర్జీ ముఖ్య పాత్రలు పోషించిన ఈ చిత్రం విడుదలై మంచి స్పందన పొందుతున్న తరుణంలో... తాప్సీ ఇండస్ట్రీ ధోరణిపై చేసిన కొన్ని సంచలన వ్యాఖ్యలు నెట్టింట తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న తాప్సీ... ప్రస్తుతం సినీ ఇండస్ట్రీలో వస్తున్న కొన్ని రకాల సినిమాలు, మార్కెట్ ధోరణిలను చూస్తుంటే తనకు నటనకు స్వస్తి చెప్పాలనే ఆలోచన వచ్చిందని సంచలన వ్యాఖ్యలు చేశారు. కథల ఎంపికలో నాణ్యత, ప్రమాణాలు తగ్గించుకుని సినిమాలు చేయాల్సిన పరిస్థితి వస్తే, నటించడం మానేసి ప్రశాంతంగా రిటైర్ అవ్వడమే తనకు ఇష్టమని తేల్చి చెప్పారు. గత కొన్ని నెలలుగా థియేటర్లలోకి వస్తున్న చిత్రాల తీరును గమనించి, “నా రిటైర్మెంట్ సమయం దగ్గరపడిందేమో” అని తన కుటుంబ సభ్యులతో కూడా సరదాగా వ్యాఖ్యానించినట్లు తెలిపారు. తనకు నటనపై ఎంతో ప్రేమ ఉన్నప్పటికీ, ఎలాంటి స్క్రిప్ట్‌నైనా ఓకే చేసేంత గుడ్డి ప్రేమ మాత్రం కాదని తాప్సీ స్పష్టం చేశారు. మార్కెట్ ట్రెండ్స్ మారుతుంటాయని, కానీ మనం చేసే సినిమాలు చరిత్రగా మిగిలిపోతాయని చెప్పారు. పదేళ్ల తర్వాత తన ఫిల్మోగ్రఫీని తిరిగి చూసుకుంటే తనకైనా, తన అభిమానులకైనా సిగ్గుచేటుగా అనిపించకూడదనేది తన తాపత్రయమని వెల్లడించారు. కష్టపడి సంపాదించుకున్న గుర్తింపును కాపాడుకునేందుకు, తన ప్రమాణాలకు తగిన కథలనే ఎంచుకుంటానని ఆమె స్పష్టం చేశారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AAKULA SUDHAKAR, PUSHPALATHA PUBLICATIONS AND PRINTING, HNo: 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLA-BELLY MANDALAM, WARANGAL DIST - 506349, TELANGANA STATE, PUBLISHED PUSHPALATHA PUBLICATIONS HNo. 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLABELLY MANDALAM, WARANGAL DIST- 506349.TELANGANA STATE,TITEL-code : RNI NUMBER ; TELTEL-2023/85680, Cell No: 9603969335, MANADUNIA 2022 @ gmail.com